సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
78932 44734
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

గణబాబుకు అభినందనల వెల్లువ



ఎమ్మెల్యే గణబాబును అభినందిస్తున్న టీడీపీ నాయకులు

గోపాలపట్నం: పశ్చిమ ఎమ్మెల్యేగా ఎన్నికైన గణబాబుకు పలువురు నాయకులు, కార్యకర్తలు అభిమానులు అభినందనలతో ముంచెత్తారు. గోపాలపట్నంలోని ఆలయ నివాసంలో పెందుర్తి కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు, తదితర నాయకులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మురళీనగర్: జోన్–2 డివిజన్ మర్రిపాలెం సెక్షన్ పరిధి ఈపీఎఫ్, కరాసా, రైల్వే క్వార్టర్స్ 11 కేవీ ఫీడర్లలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మర్రిపాలెం, వుడా లేఅవుట్, శివశివానీ పాఠశాల రోడ్డు, పోలీస్ క్వార్టర్స్, ఈపీఎఫ్ క్వార్టర్స్, రైల్వే క్వార్టర్స్, మర్రిపాలెం మెయిన్ రోడ్డు, గవరవీధి, గొల్లవీధి, రానాప్రతాప్‌నగర్, శ్రీనివాసనగర్, హుస్సేన్‌నగర్, భారత్ పెట్రోలియం బంక్ లైన్, రామాలయం వీధి, ఓల్డ్ కరాసా, న్యూ కరాసా ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని కోరారు.

కొండ ప్రాంతాల్లో విత్తన బంతులు



మురళీనగర్ కొండ ప్రాంతంలో విత్తన బంతులు చల్లుతున్న మానవ సేవే మాధవ సేవ సభ్యులు

మురళీనగర్: మానవ సేవే మాధవ సేవ అసోసియేషన్ ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా సహజసిద్ధ అడవులు పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు. సంఘ అధ్యక్షుడు సనపల భానుప్రకాష్ ఆధ్వర్యంలో బుధవారం సభ్యులు విత్తన బంతులను మురళీనగర్ పరిసరాల్లోని కొండ ప్రాంతాల్లో విసిరి, కొన్ని చోట్ల రహదారులను ఆనుకుని ఉన్న ఖాళీ ప్రదేశాల్లో చింత, రాగి, జామ, మర్రి, సపోటా, దానమ్మ విత్తనాలను నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు డి.వరప్రసాద్, ఎస్.సీతారామకృష్ణ, ఉప కార్యదర్శి పి.సంతోష్‌కుమార్, నిర్వహణ కార్యదర్శి బి.వెంకటేశ్వరావు, కోశాధికారి కె.వి.వర్మ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కథలు, కవితల పోటీలు

అగనంపూడి: అగనంపూడికి చెందిన కంచిపాటి గురుమూర్తి మూడో వర్ధంతి సందర్భంగా కథలు, కవితల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు ఆయన కుమారుడు, యువ రచయిత కంచిపాటి వెంకట్ తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొనే వారు తమ రచనలను ఈ నెల 15వ తేదీలోగా 94908 05404 నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపించాలని లేదా venkat1676@gmail.comకు మెయిల్ చేయాలని కోరారు. కథలకు సంబంధించి రచయితలు ఇష్టమైన అంశాన్ని తీసుకోవచ్చని, 8 వందల పదాలకు తగ్గకుండా, 12వందల పదాలకు మించకుండా ఉండేలా చూడాలని తెలియజేశారు. వీలైనంత వరకు తెలుగు భాషను మాత్రమే వాడాలని సూచించారు. కవితల పోటీలకు సంబంధించి సామాజిక అంశాల్లో ఏదైనా ఒక అంశాన్ని తీసుకొని 15 పాదాలకు తగ్గకుండా 25 పాదాలకు మించకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. కథలు, కవితల పోటీల్లో మొదటి ముగ్గురు విజేతలకు నగదు బహుమతులతో పాటు కన్సొలేషన్ బహుమతులు అందిస్తామన్నారు. రచయితలు తమ రచనలు పంపించేటప్పుడు ఆ పేపరుపై వారి పేరు రాయకూడదని తెలిపారు. దానికి వేరే ధ్రువపత్రం ఇవ్వాల్సి ఉంటుందని, అందులో మాత్రమే రచయిత పేరు, చిరునామా రాయాలని స్పష్టం చేశారు. విజేతలకు ఈ నెల 22న గురుమూర్తి వర్ధంతి సందర్భంగా అగనంపూడి సీడబ్ల్యూసీలో నిర్వహించే కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేస్తామని వివరించారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ వెస్ట్
8978872250

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

వాడవాడలా ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమాలు



పర్యావరణంపై అవగాహన ర్యాలీ చేస్తున్న విద్యార్థులు



సర్టిఫికెట్ అందుకుంటున్న శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కుప్పిలి కీర్తిపట్నాయక్

మల్కాపురం: వాతావరణంతో పాటు జీవులు, జలవనరులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కుప్పిలి కీర్తిపట్నాయక్ అన్నారు.తన ట్రస్టు ఆధ్వర్యంలో ఐఎన్ఎస్ డేగా పరిధిలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం సుమారు 500 మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కెప్టెన్ శివకుమార్‌యాదవ్, ట్రస్టు నిర్వాహకురాలు కీర్తిపట్నాయక్‌లు మొక్కల పెంపకం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

- ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హెచ్‌పీసీఎల్ (విశాఖ రిఫైనరీ), థాన్ ఫౌండేషన్ సంయుక్తంగా మల్కాపురంలోని కళంజియా సంస్థ సామాజికభవనం వద్ద మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ సీనియర్ మేనేజర్ కాలీ,థాన్ ఫౌండేషన్ వైజాగ్ రీజినల్ కో ఆర్డినేటర్ శ్రీరామ్‌కుమార్ పాల్గొన్నారు.
- శ్రీహరిపురం జీవీఎంసీ పాఠశాల విద్యార్థులు మొక్కలు పెంపకం వల్ల కలిగే లాభాలు, పర్యావరణాన్ని నాశనం చేస్తే కలిగే నష్టాలపై అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు ప్రకాష్ పాల్గొన్నారు.
- మల్కాపురం శాఖా గ్రంథాలయంలో పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న చిన్నారులకు మొక్కల పెంపకం వల్ల ఉపయోగాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి భాగ్యలక్ష్మి, గ్రంథాలయాధికారి అజయ్ తదితరులు పాల్గొన్నారు.



పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు, అతిథులు

అవగాహన ర్యాలీ

గోపాలపట్నం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత, పర్యావరణాన్ని మనం కాపాడితే మనల్ని పర్యావరణం కాపాడుతుందని జీవీఎంసీ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ నిర్మల అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం జీవీఎంసీ 91వ వార్డులోని జీవీఎంసీ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ సమతుల్యత కోల్పోవడం వల్ల వాతావరణంలో పెను మార్పులు వస్తున్నాయని వివరించారు. ప్లాస్టిక్ సంచుల వాడకం మానుకోవాలని గుడ్డ సంచులు వాడాని సూచించారు.



కళంజియా సంస్థకు మొక్కలు అందిస్తున్న హెచ్‌పీసీఎల్ అధికారులు



91వ వార్డులో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కూల్.. కూల్‌గా

గోపాలపట్నం: మధ్యాహ్నం వరకు ఉక్కబోతతో ఇబ్బందులు పడిన గోపాలపట్నం పరిసర ప్రాంతవాసులకు మధ్యాహ్నం కురిసిన వర్షంతో సేద తీరారు. ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమైన చల్లగాలులు వీశాయి. అనంతరం కురిసిన వర్షానికి రహదారులు కాల్వలు నీటితో నిండి పోయాయి. దీంతో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. వర్షంతో పాటు వాతావరణం చల్లబడడంతో ఎండ వేడి నుంచి ఉపశమనం కలిగిందంటూ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.



శ్మశానవాటిక జంక్షన్ వద్ద బీఆర్‌టీఎస్ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



వర్షానికి ముందు కమ్ముకొస్తున్న మేఘాలు



గోపాలపట్నం హైస్కూల్ మైదానంలో కురుస్తున్న వర్షం

ఎన్నికల ఫలితాలపై సమీక్ష

మల్కాపురం: సార్వత్రిక ఎన్నికల్లో వెలువడిన ఫలితాలను చూస్తే చాలా ఆశ్చర్యంగా ఉందని వైఎస్సార్‌సీపీ 59వ వార్డు సీనియర్ నాయకుడు పుర్రె సురేష్ యాదవ్ అన్నారు. పార్టీ వార్డు అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం నక్కవానిపాలెంలోని పార్టీ క్యాంప్ కార్యాలయంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ గెలుపు కోసం వార్డు నాయకులు, కార్యకర్తలంతా తీవ్రంగా శ్రమించామని, ఫలితం భిన్నంగా ఉండటం చాలా బాధ కలిగించిందన్నారు. ఫలితాలు ఎలా ఉన్నా రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి మరింత శ్రమిస్తామని, ప్రతి సమస్యపై పోరాటాలు చేస్తామని, పార్టీ ఆదేశాలను అనుసరిస్తూ నడుచుకుంటామని చెప్పారు.



మాట్లాడుతున్న పుర్రె సురేష్ యాదవ్

ఎన్నికల్లో శ్రమించిన ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్తకు సురేష్ యాదవ్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కుంచరావు, రాజు, రమేష్, లక్ష్మి, అమరావతి, వరలక్ష్మి, బుల్లబ్బాయి, రాము, గోపి, జగదీష్, కిషోర్, వాసు, శ్రీను, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్య కళాశాలలో కొత్త కోర్సులు

గోపాలపట్నం: గోపాలపట్నం ఆదిత్య కళాశాలలో కొత్తగా మరి కొన్ని స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు అందుబాటులోకి తీసుకు వచ్చారు. సెంటర్ ఫర్ రీసెర్చ్ ఇన్ స్కీమ్స్ అండ్ పోలసీస్ (సీఆర్ఐఎస్‌పీ) ఆధ్వర్యంలో ఈ కోర్సులు వచ్చాయని ఆదిత్యా విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో సీఆర్ఐఎస్‌పీ ద్వారా అప్రెంటిస్‌షిప్ ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రామ్‌లో భాగంగా బ్యాంకింగ్, ఫైనాన్సియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్, లాజిస్టిక్స్, రియల్ మేనేజ్‌మెంట్ కోర్సులు ప్రవేశ పెడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కోర్సుల్లో విద్యార్థులకు థియరీ ప్రాక్టికల్ రెండేళ్ల పాటు ఉంటుందని, చివరి ఏడాది పరిశ్రమల్లో అప్రెంటిస్ షిప్ చేసుకునే వీలు ఉంటుందని చెప్పారు. ఈ సమయంలో నెలకు రూ.7,000 నుంచి రూ.15 వేల వరకు స్టైఫండ్‌గా ఇస్తారని తెలిపారు. గోపాలపట్నం ఆదిత్య డిగ్రీ కళాశాలలో లాజిస్టిక్స్ కోర్సు అందుబాటులో ఉందన్నారు. ఈ కోర్సు వివరాల కోసం 99492 76662 నంబర్‌లో సంప్రదించాలని శేషారెడ్డి కోరారు.

ట్రాఫిక్ ఆంక్షలు కట్టుదిట్టం

సాక్షి ఎఫెక్ట్..

విశాఖ విద్య: ఎన్ఏడీ సమీపంలోని ఎన్ఎస్‌టీఎల్ ప్రధాన గేటు ముందు హైవేపై ప్రమాదాల నియంత్రణకు ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలను కట్టుదిట్టం చేశారు. 52వ వార్డు నుంచి ఎన్ఎస్‌టీఎల్ వైపు 90వ వార్డు సింహాచలం రోడ్డుకు వెళ్లే ద్విచక్ర వాహన చోదకులు హైవే దాటే క్రమంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీన్ని నివారించే క్రమంలో ఎన్ఎస్‌టీఎల్ ప్రధాన గేటు ముందు బారికేడ్లతో మూసివేశారు. అయినప్పటికీ కొంత మంది ఇక్కడి బారికేడ్లను తొలగించి, చిన్న సందులోంచి ద్విచక్ర వాహనాలతో వెళ్తున్నారు. దీనిపై 'సాక్షి'లో ఈ నెల 2న ప్రచురితమైన కథనానికి ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. ఇక్కడ ట్రాఫిక్ ఆంక్షలను మరింత కట్టుదిట్టం చేశారు. ద్విచక్ర వాహనదారులు తొలగించిన బారికేడ్లను పటిష్టంగా ఏర్పాటు చేసి, ఆ దారిని పూర్తిగా మూసివేశారు. 52వ వార్డు నుంచి సింహాచలం రోడ్డుకు వెళ్లే వారు.. ఇక నుంచి ఫ్లైఓవర్ కింద నుంచి యూటర్న్ తీసుకొని, తిరిగి ఎన్ఎస్‌టీఎల్ వైపునకు రావాల్సి ఉంటుంది. ప్రమాదాల నియంత్రణ కోసమే ఇటువంటి ఏర్పాట్లు చేశామని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాని ట్రాఫిక్ పోలీసులు కోరుతున్నారు.



ఎన్ఎస్‌టీఎల్ గేటు ముందు రహదారిని మూసివేస్తూ ఏర్పాటు చేసిన బారికేడ్లు

అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేసి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలు పాల్గొన్నారు.

క్లాక్ టవర్ పనులు పరిశీలించిన కమిషనర్



క్లాక్ టవర్ పనులపై అధికారులకు సూచనలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



లేపాక్షి జంక్షన్ వద్ద సర్కిల్ నిర్మాణంపై సూచనలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: నగర సుందరీకరణలో భాగంగా జీవీఎంసీ జోన్ – 4 పరిధి జగదాంబ జంక్షన్‌లో నిర్మిస్తున్న క్లాక్ టవర్ పనులను బుధవారం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరంలోని కూడళ్ల అభివృద్ధిలో భాగంగా జగదాంబ జంక్షన్‌లో ఆకర్షణీయమైన క్లాక్ టవర్ నిర్మిస్తున్నామన్నారు. పనులు దాదాపు పూర్తయ్యాయని, ఆకర్షణీయమైన రంగులు వేసి అందంగా తీర్చిదిద్ది, మిగిలిన పనులు కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జగదాంబ జంక్షన్ రోడ్డు సెంటర్ మీడియన్‌లో ఎత్తుపల్లాలు లేకుండా సమాంతరంగా చేసి ఆకర్షణీయమైన మొక్కలు నాటాలని పర్యవేక్షక ఇంజినీర్ వినయ్‌కుమార్‌ను ఆదేశించారు. అనంతరం జగదాంబ జంక్షన్ నుంచి పాతపోస్టాఫీస్ వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు పరిశీలించారు. లేపాక్షి జంక్షన్ వద్ద వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా సర్కిల్ నిర్మాణ పనులు చేపట్టాలని, అలాగే రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయడంతోపాటు కొత్త రోడ్డు జంక్షన్ వద్ద కల్వర్టు నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని పర్యవేక్షక ఇంజినీరు పీవీవీ సత్యనారాయణరాజును ఆదేశించారు. పర్యటనలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే పర్యావరణ సమతుల్యత

సీతంపేట: పర్యావరణాన్ని కాపాడుకోలేక పోతే మానవజాతి మనుగడకే ప్రమాదమని నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్ అన్నారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో పర్యావరణ పరిరక్షణపై జరిగిన కవి సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ గాలి, నీరు నేల పంచభూతాలను మనిషి కలుషితం చేస్తున్నాడన్నారు. పర్యావరణ సమతుల్యత కోసం అడవుల పరిరక్షణ, మొక్కల పెంపకం జరగాలని, ప్లాసిక్ వస్తువు ల వినియోగం ఆపాలని కోరారు. కార్యక్రమంలో కవులు, రచయితలు కె.జి.వేణు, డి.వి.సూర్యారావు, ఎస్.విజయ్‌కుమార్, చింతా ప్రభాక ర్, చిన సూర్యనారాయణ, కొత్తూరు రమణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆచార్య బాలమోహన్‌దాస్

ప్రకృతి ఆధారిత పంటలతో మేలు

మురళీనగర్: విశ్వంలోని ప్రతి జీవి మనుగడ సాధించాలంటే పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉండాలిన వనమాలి గార్డెనర్స్ క్లబ్ చీఫ్ అడ్మిన్ అరవల అరుణ పిలుపునిచ్చారు. మురళీనగర్‌లోని సుదర్శన్ పార్కులో నిర్వహించిన పర్యావరణ దినోత్సవంలో ఆమె మాట్లాడారు. మన భూమి పరిరక్షణ అనే అంశంతో ఈ ఏడాది పర్యావరణ దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. ప్రకృతి ఆధారిత పంటలు పండించే విధానంపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

ఫ్లై ఓవర్ కింద గందరగోళం!

- వందలాది ద్విచక్ర వాహనాల పార్కింగ్
- రాకపోకలకు తీవ్ర అంతరాయం
- వాహనదారుల మధ్య వాగ్వాదాలు



ఎన్ఏడీ సెంటర్‌లో అంబేడ్కర్ నగర్ వైపు సర్వీస్ రోడ్డు వాహనాలతో మూసివేత



గోపాలపట్నం వైపు వెళ్లే దారిలో ఫ్లై ఓవర్ కింద పార్క్‌చేసిన వాహనాలు

విశాఖ విద్య: నగరంలో ఎన్ఏడీ ప్రధానమైన కూడలి. అటు గాజువాక, ఇటు ఆర్టీసీ బస్టాండ్, మరో వైపు పెందుర్తి, ఇంకో వైపు మర్రిపాలెం రైల్వే స్టేషన్ ఇలా నలువైపుల నుంచి వచ్చేవారు ఎన్ఏడీ సెంటర్ నుంచే రాకపోకలు సాగించాలి. ఎన్ఏడీకి సమీపంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోని ఇండస్ట్రియల్ కారిడార్(పారిశ్రామిక ప్రాంతం) కూడా ఉంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు, ప్రత్యేకంగా ట్రాఫిక్ నియంత్రణకు వేర్వేరుగా పోలీసు వ్యవస్థ ఉంది. అయితే ఫ్లైఓవర్ కింద గోపాలపట్నం, ఆర్టీసీ బస్టాండ్ వైపు వచ్చే దారిలో ద్విచక్ర వాహనాలు వందల సంఖ్యలో పార్కింగ్ చేసి రోజుల తరబడి వదిలేయడంతో ఆ దారిలో రాకపోకలకు కొంత అసౌకర్యంగా ఉంది.

ఆ వాహనాలు ఎవరివో?

ఫ్లై ఓవర్ కింద పార్కింగ్ చేస్తున్న కొన్ని ద్విచక్రవాహనాలు ఎవరివి అనేది తెలియని పరిస్థితి. దూర ప్రాంతాలకు రోజు వారీ విధులు నిర్వర్తించే వారి వాహనాలు కొన్ని ఉంటున్నాయి. అయితే కొన్ని వాహనాలు నెలల తరబడి అలానే ఉండిపోవడంతో వాటిని ఎవరు పార్కింగ్ చేశారు..? ఆ వ్యక్తులు ఏమయ్యారు..? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

వాహనదారుల మధ్య వాగ్వాదం

ఫ్లై ఓవర్ కింద నుంచి గోపాలపట్నం వైపు వెళ్లే దారిలో ఎక్కువ సంఖ్యలో ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. ఇక్కడ అటు నుంచి ఇటు వైపు రోడ్డుకు ద్వి చక్రవాహనాలు రాకపోకలు సాగించేలా ఫ్లై ఓవర్ దిగువన మార్గం ఉంచారు. ఈ దారిని మూసేలా ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు చిన్న ఏమరపాటుతో ఉన్నా ఢీ కొట్టుకునే పరిస్థితులు ఉన్నాయి. రెండు రోజుల కిందట ఇక్కడ ఇలాంటి దృశ్యాలే కనిపించాయి. ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు తప్పుకున్న క్రమంలో ఢీకొట్టుకున్నారు. దీంతో వారి మధ్య పెద్ద వాగ్వాదమే సాగింది. అరగంటకుపైగా జనం గుమిగూడడంతో ట్రాఫిక్‌కు అవాంతరం ఎదురైంది.

దృష్టి పెడితే మేలు

ఎన్ఏడీ ఫ్లై ఓవర్ కింద పార్కింగ్ చేసిన వాహనాల్లో రోజుల తరబడి వదిలేసినవి ఎవరవనే దానిపై దృష్టి పోలీసులు దృష్టిపెట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఏదైనా జరగరాని ఘటనలు సంభవించినప్పుడు హడావుడి చేసేబదులు ముందుగానే ఇలాంటి వాటిపై దృష్టి సారిస్తే మంచిదని ఎన్ఏడీ సెంటర్ వాసులు విన్నవిస్తున్నారు.



ఘర్షణ పడుతున్న ద్విచక్ర వాహనదారులు



జనం గుమిగూడడంతో రాకపోకలకు అంతరాయం

ఎరుకుమాంబకు జలాభి షేకం



ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న ఈవో రమాబాయి, భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో కొలువుదీరిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు స్వహస్తాలతో పసుపు నీటితో అభిషేకం నిర్వహించారు. అమ్మవారికి జలాభిషేకం చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. ముందుగా ఆలయ ఈవో రమాబాయి ఆధ్వర్యంలో ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి బిందెలతో పసుపు నీళ్లు తీసుకెళ్లి అభిషేకం చేశారు. ప్రధానార్చకుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉదయం పంచామృతాభిషేకం జరిపారు. సాయంత్రం 5 గంటల నుంచి కూడా అమ్మవారికి గంధం నీటితో అభిషేకాలు చేశారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ వెస్ట్
9912222753, 9705933394
Office mail : sakshiadvtvsp@gmail.com